### వ్యూహాత్మకంగా దూసుకొచ్చారు..!

# తప్పించుకోకుండా దెబ్బ కొట్టారు


బీజాపూర్‌లో భద్రపరిచిన మావోయిస్టుల మృతదేహాలు, వస్తువులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 9: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆపరేషన్ 'కగార్'తో దూసుకుపోతున్న భద్రతాదళాలు పెద్దఎత్తున మావోయిస్టులపై ఎదురుదెబ్బ కొట్టారు. మావోయిస్టులు తప్పించుకునే అవకాశం లేకుండా చేసి వ్యూహాత్మకంగా తమ పాచికలను అమలుచేశారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్‌లు రచించిన వ్యూహానికి మావోయిస్టులు గన్‌డౌన్ చేయక తప్పలేదు. మొత్తం 2,799.08 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్న ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారుల డైరెక్షన్‌లో భద్రతాదళాలు దూసుకొచ్చాయి. సుమారు వెయ్యిమందితో ఉన్న సాయుధ బలగాలు నలువైపుల నుంచి చుట్టుముట్టడంతో మావోయిస్టులకు తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయినట్లు తెలుస్తోంది. దీంతో మావోయిస్టులపై కాల్పులకు దిగడంతో భద్రతాదళాలు సైతం ఫైరింగ్ ఓపెన్ చేశాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య గంటల వ్యవధిలో జరిగిన పోరులో 31 మంది మావోయిస్టులు సహా, ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. దట్టమైన అటవీప్రాంతం కావడంతో జవాన్లు సైతం కొంత అయోమయానికి గురికావడంతో వారివైపు నుంచి సైతం నష్టం చవిచూడాల్సి వచ్చింది. దీంతో ఈ మధ్యకాలంలో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్ల ఖాతాలో ఈ ఎన్‌కౌంటర్ కూడా చేరింది. డ్రోన్ కెమెరాల సహాయంతో ఈ ఆపరేషన్‌కు లొకేషన్‌ను గుర్తించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా వాయుసేనని సైతం ఈ ఆపరేషన్‌కు వినియోగించడంతో భద్రతా దళాలు పైచేయిగా నిలిచారనే విషయం అవగతమవుతోంది. ప్రస్తుతం ఈ ఎన్‌కౌంటర్లో మరికొంతమంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు భారీసంఖ్యలో భద్రతా దళాలు అడవులను జల్లెడ పడుతూ ఆపరేషన్ 'కగార్'ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్న సందర్భాలు.. '2026 మార్చి నాటికి మావోయిస్టు పార్టీకి కష్టకాలాలు ఎదురవనున్నాయా?' అనే విధంగా ఉన్నాయి.

# దండకారణ్యంలో రక్తపుటేర్లు

- ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు హతం
- ఇద్దరు జవాన్లు కూడా మృతి.. మరో ఇద్దరి పరిస్థితి విషమం..
- మృతుల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ క్యాడర్ల మావోయిస్టులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 9: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు - భద్రతాదళాలకు మధ్య జరిగిన భీకరపోరులో పచ్చని ప్రకృతి వనం రక్తపుటేరులై పారింది. యుద్ధభూమిని తలపించిన ఇరువర్గాల పోరు.. పదుల సంఖ్యలో ప్రాణాలను బలిగొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు హతమవగా, ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఫర్సేఘఢ్ ఇలాకాలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో జిల్లా రిజర్వు గార్డు (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), బస్తర్ ఫైటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు వెయ్యి మంది భద్రతా దళాలు పాల్గొన్నాయి. మావోయిస్టులు ఉన్న లోకేషన్‌ను జవాన్లు నలుదిక్కులా చుట్టుముట్టారు. ఈ క్రమంలో ఉదయం నేషనల్ పార్క్ ఏరియాలోని అటవీ ప్రాంతంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. కాసేపటికి తేరుకున్న జవాన్లు అప్రమత్తమైన మావోయిస్టులపై ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు మూడు - నాలుగు సార్లు విడతల వారీగా కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. మావోయిస్టులను చుట్టుముట్టి వస్తున్న భద్రతాదళాల తాకిడి పెరగడంతో వారి ధాటికి తాళలేక కాల్పులు జరుపుకుంటూనే అక్కడి నుంచి పారిపోయారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమించడతో ఇందులో ఒక ఎస్టీఎఫ్ జవాన్, ఒక డీఆర్‌జీ జవాన్ మృతిచెందారు. మిగతా ఇద్దరు జవాన్లను ఎయిర్‌లిఫ్టర్ సహాయంతో మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురుకాల్పుల్లో మృతిచెందిన 31 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఏకే-47, ఎస్ఎల్ఆర్, 303 రైఫిల్, ఇన్‌సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్లతోపాటు భారీఎత్తున ఇతర ఆయుధ వస్తు, సామగ్రిని ఘటనా స్థలం నుంచి భద్రతాదళాలు స్వాధీనపరుచుకున్నాయి. మృతిచెందిన మావోయిస్టుల్లో తెలంగాణ క్యాడర్‌కి చెందిన మావోయిస్టులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ మీడియాతో మాట్లాడుతూ.. బీజాపూర్ జిల్లా అడవుల్లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన మావోయిస్టులు సమావేశమవుతున్నట్లుగా వచ్చిన పక్కా సమాచారం మేరకే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో భద్రతా దళాలు, మావోయిస్టులు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందారని ఆయన తెలిపారు. అదే విధంగా డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ బలగాలకు చెందిన ఇద్దరు జవాన్లు సైతం మృతి చెందినట్లు స్పష్టం చేశారు. 2025లో మొదలు నుంచి ఇప్పటివరకు జరిగిన ఎదురుకాల్పుల్లో 65 మంది మావోయిస్టుల మృతదేహాలను రికవరీ చేసినట్లు ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఘటనతో బస్తర్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేసి, గాలింపులను ముమ్మరం చేస్తున్నట్లు ఆయన వివరించారు. మృతుల పూర్తి వివరాలను గుర్తించాక వెల్లడించనున్నట్లు తెలిపారు. సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మందమర్రి ప్రాంతానికి చెందిన బండి ప్రకాశ్ (65) అలియాస్ బండి దాదా అలియాస్ ప్రభాత్ ఈ ఎదురుకాల్పుల్లో మృతిచెందినట్లు సమాచారం. అదేవిధంగా మృతుల్లో ఆదిలాబాద్ ఏరియా కార్యదర్శి ఆదేలు భాస్కర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

### జనాభాను తగ్గించి చూపడం దారుణం



గత కేసీఆర్ ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వేనే వంద శాతం కరెక్టు. కుల గణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి చూపడం దారుణం. అసంపూర్తి సర్వేను ప్రభుత్వం ఆమోదిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్వే లెక్కల కంటే కూడా తగ్గించే ప్రయత్నం చేస్తుంది. జనాభా పెరిగితే బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని ప్రభుత్వం తగ్గించి చూపుతున్నది. కులాలవారీగా జనాభాను ప్రకటించాలి.

**-వీరబోయిన వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు, యాదవ సంఘం నాయకుడు, అన్నపురెడ్డిపల్లి**

### కుటుంబాలను మాయం చేశారు



కుల గణనలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుటుంబాలను మాయం చేసింది. ఉద్యోగులు సర్వే చేసినా ఆన్‌లైన్‌లో పొందుపరచకుండా అన్యాయం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించింది. సర్వే వల్ల బీసీలకు రాజకీయ రంగాలతోపాటు అన్ని రకాలుగా లబ్ధి చేకూరుతుందని ఆశపడ్డాం. 60 శాతం పైగా ఉన్న బీసీ కులాలను 47 శాతంగా చూపించడం దారుణం. ఇలాంటి సర్వేల వల్ల బీసీ సామాజిక వర్గానికి తీరని నష్టం జరుగుతుంది.

**– బంధం శ్రీనివాసరావు, మధిర మార్కెట్ మాజీ చైర్మన్**

### లెక్కలు పకడ్బందీగా ఉండాలి



బీసీ జనాభా లెక్కల వ్యవహారం పకడ్బందీగా ఉండాల్సిందే. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీల కుల గణన లెక్కలన్నీ తప్పుల తడకలుగా ఉన్నాయి. రాష్ట్రంలో రోజురోజుకూ జనాభా పెరుగుతుంది కానీ తగ్గుతుందా? ప్రస్తుతం ప్రజలను మభ్య పెట్టేందుకే బీసీ జనాభా లెక్కలు తీశారు. ఇంతమంది బీసీలను మోసం చేయడం సరికాదు.


**– చెక్కిలాల మోహన్‌రావు, మాజీ జడ్పీటీసీ**

### ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి..



బీసీల కుల గణన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి మాదిరిగా ఉంది. కుల గణనపై బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదు. భవిష్యత్‌లో ప్రభుత్వం బీసీ సంఘాల సత్తా చవి చూడాల్సి వస్తుంది. రోజురోజుకూ ప్రభుత్వం మాటలతో మభ్యపెట్టేలా ఉంది.

**– చెక్కిలాల లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్**



# ఓట్లేస్తే: నమ్మకద్రోహం చేస్తారా?

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బడుగుజీవులు**

*'నమ్మి ఓటేస్తే నమ్మకద్రోహం చేస్తారా?' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బడుగుజీవులు. తాము అధికారంలోకి వస్తే బీసీల రిజర్వేషన్లు పెంచుతామని, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని, 42 శాతం రిజర్వేషన్లు తెచ్చి అమలుచేస్తామని హామీలమీద హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడెందుకు మోసానికి పాల్పడుతోందని ప్రశ్నించారు. కులగణనను సమగ్రంగా నిర్వహించకపోవడం, బీసీల జనాభాను తగ్గించిచూపడం, రిజర్వేషన్ల ఆమోదానికి కేంద్రంతో మెలికపెట్టడం వంటివన్నీ రాజకీయంగా బీసీలను అణగదొక్కేందుకు చేస్తున్న కుట్రలుగానే భావిస్తున్నామని అన్నారు. దేశ జనాభా, ఓటర్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ రోజుల్లో బీసీల జనాభా మాత్రమే ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. మరి ఉన్నట్టుండి ఓసీల జనాభా ఎలా పెరిగిందో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన అత్యంత లోపభూయిష్టంగా ఉందనేందుకు బీసీల జనాభా తగ్గుదలే సుస్పష్టమైన కారణమని తేల్చిచెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఎందుకు అమలుచేయరో చెప్పాలని డిమాండ్ చేశారు. 'మేము ఓట్లు వేసి గెలిపించాక మీరెందుకు మీ హామీని నెరవేర్చరు?' ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ చేసిన నమ్మక ద్రోహాన్ని ముమ్మాటికీ సహించబోమని, చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించేదాకా రేవంత్ ప్రభుత్వాన్ని వదలబోమని స్పష్టం చేశారు.*

*-నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 9*

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఎందుకు అమలుచేయరో చెప్పాలి
- బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీ ఇచ్చారు కదా?
- మేము ఓట్లు వేసి గెలిపించాక మీరెందుకు హామీని నెరవేర్చరు?
- రాజకీయంగా మమ్మల్ని అణగదొక్కేందుకు కుట్రలు చేస్తున్నారా?
- తప్పుడు లెక్కలతో కులగణన చేసి నిజమైన సర్వేగా నమ్మిస్తారా?
- నయవంచనను సహించం.. రిజర్వేషన్లు ఇచ్చే దాకా వదలం..
- రిజర్వేషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని నిలదీస్తున్న బీసీలు
- 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనంటున్న బహుజనులు

### ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకే..



కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. చేతల్లో ఏమీ కనిపించడం లేదు. కొన్నేళ్ల నుంచి బీసీ సంఘాలు ఐక్య ఉద్యమాలు చేసినా ఎన్నికల్లో పబ్బం గడుపుకోవడానికే రిజర్వేషన్ల మాట ఎత్తాయి. ఎన్నికలయ్యాక తూతూ మంత్రంగా తప్పుల తడకగా లెక్కలు వేసి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.

**– వర్ధబోయిన నాగేశ్వరరావు, యాదవ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి**

### బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టింది. బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని అసంపూర్తిగా సర్వే చేసి చేతులు దులుపుకుంది. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే 100 శాతం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 97 శాతమే పూర్తి చేసింది. బీసీలను తగ్గించి.. ఓసీలను పెంచి చూపించారు. కాంగ్రెస్ పార్టీలోనే సర్వేపై నమ్మకం లేదు. కుల గణన సర్వేతో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ దగా చేసింది.

**-జుజ్జూరపు వెంకన్నబాబు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి, అశ్వారావుపేట**

### బీసీల జనాభాను తగ్గించారు..



కాంగ్రెస్ ప్రభుత్వ కుల గణన సర్వే అంతా తప్పుల తడక. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో బీసీల జనాభా గణనీయంగా తగ్గింది. తమ ప్రభుత్వం రాగానే బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఏకంగా బీసీ జనాభా శాతాన్ని తగ్గించింది. దీనిపై బీసీలంతా ఐక్య పోరాటాలు చేయాల్సిందే.

**-కుంటా లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్**

### సర్వే చేయకుండానే గణాంకాలా?



పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు బీసీల జనాభా ఎలా తగ్గుతుంది. బీసీల్లోని అన్ని కులాలను సర్వే చేయలేదు. ప్రభుత్వం తప్పుడు నివేదికను ప్రజల ముందుంచింది. కుల గణన సర్వేను పూర్తి చేయకుండానే గణాంకాలు విడుదల చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. స్థానిక సంస్థల్లో మెప్పు పొందడానికే హడావిడిగా నివేదికను ప్రచురించారు. బీసీలకు జరిగిన అన్యాయంపై స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

**-గడ్డం వెంకటేశ్వర్లు గౌడ్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి, ముదిగొండ**

### ఓసీల జనాభా ఎలా పెరిగింది?



రెండు నెలలపాటు చేపట్టిన కుల గణన సర్వే వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. వాస్తవంగా గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతానికంటే ఎక్కువగా ఉంది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో మాత్రం 48 శాతంగానే నమోదైంది. అదీకాక ఓసీల జనాభా ఒక్కసారిగా ఎలా పెరిగింది. మళ్లీ సర్వే చేయాల్సిందే.

**-కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్**


'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన ఎలా?' అనే అంశంపై హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు, చిత్రంలో కేటీఆర్

# పరీక్షలంటే ఆందోళన వద్దు

**'ప్రేరణ' శిక్షణ తరగతుల్లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 9: పరీక్షలంటే ఆందోళన చెందవద్దని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. విద్యార్థులకు సూచించారు. కొత్తగూడెంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన 'పరీక్షలు - ప్రేరణ శిక్షణ తరగతులు' అనే కార్యక్రమంలో బీసీ వసతి గృహాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఎల్లప్పుడూ ప్రశాంతంగా చదువుకోవాలని, పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా మానసికంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లా అధికారులు ఇందిర, మీరా హుస్సేన్, బీఎస్ఎన్ రెడ్డి, మోహన్‌రావు, సైదులు పాల్గొన్నారు.

- సహకార సంఘాల ఎన్నికలపై సందిగ్ధత
- 13తో ముగియనున్న పాలకవర్గాల గడువు
- ఎన్నికలకు భయపడుతున్న కాంగ్రెస్ సర్కార్!
- నామినేట్ చేసేందుకు ప్రయత్నం?
- ఆశావహుల్లో పెరుగుతున్న ఆందోళన
- ప్రత్యేకాధికారులను నియమిస్తారని ప్రచారం
- అయోమయంలో జిల్లా ఉన్నతాధికారులు

# పోలింగా? పొడిగింపా?

**సహకార సంఘాల ఎన్నికలపై అటు అధికారులు, ఇటు అధికార పార్టీ నేతల్లోనూ సందిగ్ధత నెలకొంది. ఈ నెల 13తో పాలకవర్గాల గడువు ముగియనున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణపై ఎటువంటి స్పష్టత లేదు. దీంతో రేవంత్‌రెడ్డి సర్కార్ సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తుందా? లేక ఉన్న పాలకవర్గాల పదవీకాలం పొడిగిస్తుందా? అనే మీమాంస నెలకొంది. అయితే రైతు సంక్షేమ పథకాలు అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సహకార ఎన్నికలకు వెళ్లేందుకు భయపడుతుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతున్నది. రుణమాఫీ నుంచి రైతుభరోసా వరకు అడుగడుగునా కొర్రీలు పెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నది. ఎరువుల కొరత అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. వేసవి సమీపిస్తున్న దశలో కరెంట్ కోతలపైనా రైతులు ఆందోళనగా ఉన్నారు. ఫలితంగా అన్నివర్గాల రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లకుండా నామినేట్ చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు సైతం అయోమయంతో తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ఆశావాహులు మరింత ఉత్కంఠకు గురవుతున్నారు.** – అశ్వారావుపేట, ఫిబ్రవరి 9



సహకార సంఘాల ఎన్నికలపై నీలినీడలు కప్పుకున్నాయి. పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 13తో ముగుస్తున్నది. కొత్త పాలకవర్గాల ఎంపికపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆరునెలలు ముందుగానే ఎన్నికల ప్రక్రియ మొదలుకావాల్సి ఉండగా కేవలం 3 రోజుల గడువు ముగుస్తున్నా ఆ ఊసేలేదు. ఎటువంటి ముందస్తు కసరత్తు లేకపోవడం గమనార్హం. దీనిపై రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. 2020 ఫిబ్రవరి 13న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సహకార సంఘాలకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. తర్వాత రోజు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, జిల్లా మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాల సభ్యులు ఎన్నికయ్యారు. వీటి పదవీ కాలం కూడా 14తో ముగుస్తుంది.

**కొత్త సంఘాల ఏర్పాటు..**

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 21 సహకార సంఘాలు ఉన్నాయి. వీటి సంఖ్యను పెంచేందుకు పాలకవర్గాల నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మరో 35 కొత్త సంఘాల ఏర్పాటుకు దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం వీటిని ఆమోదిస్తే మొత్తం సంఖ్య 56 సంఘాలకు చేరుతుంది. కొత్త జిల్లాస్థాయిలో సహకార బ్యాంక్ విస్తరణ ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినప్పుడు ఆయా జిల్లాలో స్థాయిలో సహకార బ్యాంకులను విస్తరించాలని ప్రభుత్వం సూచించింది. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఖమ్మం వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**నామినేట్ చేయాలనే ఆలోచన..**

రైతు సంక్షేమంలో తీవ్ర వ్యతిరేతకను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు భయపడుతున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దశలో ఎన్నికలకు వెళ్తే రైతుల నుంచి ఛీదరింపులు తప్పవనే భావనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే నామినేట్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించాలనే ఆలోచనలోనూ ఉన్నట్లు తెలుస్తోంది. అలా కాకుంటే పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇవ్వొచ్చనే వాదన బలంగా వినిపిస్తున్నది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల నేతలు, ఆశావాహులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

### ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..

సహకార సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై తదుపరి చర్యలు తీసుకుంటాము. ఎన్నికలా.. లేదా పదవీకాలం పొడిగింపా అన్న నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలి. ఇప్పుడు ఉన్న పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 13తో ముగుస్తుంది. జిల్లాలో మొత్తం 21 సంఘాలు ఉన్నాయి. కొత్త సంఘాల కోసం 35 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

**– ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి, కొత్తగూడెం**

### గ్రామీణ వైద్యుల

# సేవలు అభినందనీయం

**వారి సమస్యలపై శాసనమండలిలో చర్చిస్తా : తాతా మధు**


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 9: గ్రామీణ వైద్యుల సమస్యలను శాసనమండలిలో చర్చిస్తానని, రాత్రనక, పగనలక మారుమాల ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. ఆదివారం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం మహాసభ ఖమ్మం నగరం బైపాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాతా మధు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నిరంతరం సేవచేసే వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యులకు బీఆర్ఎస్ అండదండలు ఎప్పటికీ ఉంటాయన్నారు. గ్రామీణ వైద్యుల సేవలపై అజయ్ పాడిన పాటల సీడీ, గ్రామీణ వైద్యుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, సత్యనారాయణ, బెల్లంకొండ మోహన్, వెంకటనారాయణ, బీఆర్ఎస్ నేతలు బెల్లం వేణుగోపాల్, న్యాయవాది మేకల సుగుణారావు, డాక్టర్ పరుచూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ హరిత, వెంకటాచారి, మణికుమార్, సుదర్శన్, రాములు, కృష్ణమూర్తి, భాస్కర్ పాల్గొన్నారు.